క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్లు కొనొద్దు



ఎల్లారెడ్డి: గుర్తు తెలియని వ్యక్తుల నుంచి పాత సెల్ ఫోన్లను కొనుగోలు చేయవద్దని ఎస్సై గణేష్ సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫోన్లు పోగొట్టుకున్న వారికి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా లభించిన ఫోన్లను బాధితులకు అందించారు. సెల్ ఫోన్లు పాత వాటిని కొనుగోలు చేయవద్దని, పాత ఫోన్లను కొని మోసపోవద్దని అన్నారు.

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం ఖండేబల్లూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ పాటిల్‌కు బుధవారం స్థానిక ఎస్సై సత్యనారాయణ సెల్‌ఫోన్ అందజేశారు. శ్రీకాంత్ పాటిల్ ఖండేబల్లూర్ నుంచి బిచ్కుందకు వాహనంలో వెళ్తుండగా మార్గమధ్యలో ఫోన్ పోగొట్టుకున్నాడు. జుక్కల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై సత్యనారాయణ విచారణ చేపట్టారు. సెల్‌ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి బాధితుడికి ఫోన్‌ను అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిక



బాన్సువాడ: కొయ్యగుట్టకు చెందిన పలువురు బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. రవి, అరవింద్, చిన్న, రాహుల్, రాజేష్, ధనుష్, జైపాల్, వెంకటేష్ తదితరులున్నారు.

ఫిజియోథెరపి క్యాంపు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం గల చిన్నారులకు డాక్టర్ అరుణ్ వైద్య పరీక్షలను నిర్వహించారు. చిన్నారులకు ప్రతి రోజు ఫిజియోథెరపికి సంబంధించిన వ్యాయామాలను ఇంటి వద్ద తల్లిదండ్రులు చేయించాలని వైద్యులు సూచించారు. భవిత సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కుప్రియాల్‌లో బుధవారం రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన పత్రాన్ని జిల్లా కమిటీకి అందజేశారు. రెడ్డి కార్పొరేషన్ కోసం రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రెడ్డి కార్పొరేషన్ జిల్లా బాధ్యులు కొప్పుల గంగారెడ్డి, ఏలేటి భూంరెడ్డి, బాపురెడ్డి, జైపాల్ రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలువురి నియామకం



కామారెడ్డి అర్బన్: తెలంగాణ జాగృతి విస్తరణ, రాబోయే సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించే విధంగా ప్రచారం నిర్వహించడానికి ఎమ్మెల్సీ కవిత ఆదేశాల మేరకు బుధవారం పలువురు ప్రతినిధులను నియమించినట్లు జాగృతి జిల్లా అధ్యక్షుడు చిట్టిమల్ల అనంతరాములు తెలిపారు. కామారెడ్డి మంజీరా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిల్లా మహిళా కన్వీనర్‌గా బజా లలిత, కో–కన్వీనర్‌గా ఆకుతోట భాగ్య, మీడియా పీఆర్‌వోగా కొడిప్యాక సాయిరాం, కామారెడ్డి నియోజకవర్గం మహిళా కో–కన్వీనర్‌గా ఆకుతోట సునీతారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గ విద్యార్థి విభాగం కన్వీనర్‌గా అచ్యుత్‌రెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గం యువజన కన్వీనర్‌గా అంగోత్ దేవీసింగ్, కామారెడ్డి నియోజకవర్గం కన్వీనర్‌గా అవుసుల రాజులను నియమిస్తు ఉత్తర్వు పత్రాలను అందజేశారు.

రైతు బంధు మండల కన్వీనర్‌గా ..

రాజంపేట: నూతన రైతు బంధు మండల కన్వీనర్‌గా ఆరేపల్లి గ్రామానికి చెందిన భిక్యాజి బల్వంతరావ్‌ను నియమిస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పని చేసిన జూకంటి మోహన్ రెడ్డి స్థానంలో ఆయనకు ఈ అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా భిక్యాజి బల్వంతరావ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి మండల రైతు బంధు కన్వీనర్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం సేవలు అందిస్తానని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- కలెక్టరేట్‌లోనికి వెళ్లేందుకు యత్నం
- పోలీసులు, అంగన్‌వాడీల మధ్యతోపులాట



అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ



బారికేడ్లను తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు యత్నిస్తున్న అంగన్‌వాడీలు

కామారెడ్డి టౌన్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ, అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కలెక్టర్ ముట్టడికి తరలివచ్చారు. పోలీసులు కలెక్టరేట్ ముందే బారికేడ్లను అడ్డుపెట్టి అడ్డుకున్నారు. దీంతో అక్కడే బైఠాయించిన అంగన్‌వాడీలు, నాయకులు మూడు గంటల పాటు ధర్నా చేపట్టారు. కలెక్టర్ రావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అధికారులెవ్వరూ రాకపోవడంతో సహనం కోల్పోయి బారికేడ్లను తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు యత్నించారు. పోలీసులు అడ్డుకుని స్వల్పంగా లాఠీచార్జీ చేశారు. పలువురు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. వారిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారి వినతిపత్రం తీసుకున్నారు.

ప్రభుత్వాన్ని గద్దె దించుతాం: సీఐటీయూ

ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని సీఐటీయూ జిల్లా కన్వీనర్ కందూరి చంద్రశేఖర్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సురేష్‌లు అన్నారు. మహిళల 33 శాతం రిజర్వేషన్ కోసం పోరాడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయకపోవడం దారుణమన్నారు.

కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి: షబ్బీర్ అలీ

కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. అంగన్‌వాడీ ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమని అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ప్రత్యేక తెలంగాణలో అన్ని వర్గాలను రోడ్డుమీదకు తెచ్చిన కేసీఆర్‌కు ఓడించాలని పిలుపునిచ్చారు.

మార్కెట్ కమిటీ ఆదాయ పెంపునకు కృషి



మాట్లాడుతున్న పిప్పిరి వెంకటి

కామారెడ్డి రూరల్: కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయ పెంపునకు కృషి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకటి, వైస్ చైర్మన్ కుంబాల రవియాదవ్‌లు పేర్కొన్నారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 3 నెలల ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. రాబోయే రోజుల్లో కమిటీ ఆదాయం పెంచుకోవడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. డైరెక్టర్లు మాలావత్ రవీందర్, చేడె రాజ్యలక్ష్మీ, షేక్ అజీజ్, బండారి సర్వారెడ్డి, వెల్మ మల్లారెడ్డి, ఏఎంసీ సెక్రటరీ నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ఐదు శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి



కామారెడ్డి రూరల్: కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లులో దివ్యాంగ మహిళలకు ఐదు శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు జంగం శ్రీశైలం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డిలో ఆయన మాట్లాడుతూ..స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి దివ్యాంగులకు ఎక్కడా రాజకీయ రిజర్వేషన్లు లేవని, ప్రధాన రాజకీయ పార్టీలు దివ్యాంగ మహిళల కోసం పోరాటం చేయాలని కోరారు. దివ్యాంగ మహిళలను మరిచిపోవడం బాధాకరమని అన్నారు.

ముదిరాజ్ ధర్మయుద్ధం సభను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

దోమకొండ: కామారెడ్డిలో ఈనెల 25న జరిగే ముదిరాజ్ ధర్మయుద్ధం సభను విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం దోమకొండ అధ్యక్షుడు పున్న లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డిలో లక్ష మందితో ముదిరాజ్‌ల ఐక్యత చాటడానికి సభ జరుగుతుందన్నారు. సమావేశంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి అబ్రబోయిన స్వామి, సంఘం మండల ప్రతినిధులు రాజేందర్, మధు, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి: హలో ముదిరాజ్ చలో కామారెడ్డి కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం ముదిరాజ్ సంఘ ప్రతినిధులు మాచారెడ్డిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు నీలకంఠం మాట్లాడుతూ.. ముదిరాజుల ధర్మ యుద్ధ ర్యాలీకి మాచారెడ్డి మండలం నుంచి ఇంటికి ముగ్గురు కదలిరావాలని పిలుపునిచ్చారు.

ఎల్‌వోసీల అందజేత

కామారెడ్డి క్రైం: అనారోగ్య కారణాలతో పాల్వంచ గ్రామానికి చెందిన జగదీశ్వర్ హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో రూ.1.50 లక్షల విలువైన ఎల్‌వోసీని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మంజూరు చేయించి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

సత్యశోధక్ సమాజ్ మహోత్సవాల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

కామారెడ్డి టౌన్: మహాత్మ జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 150 ఏళ్ల మహోత్సవాల వాల్ పోస్టర్లను భారతీయ విద్యార్థి మోర్చా ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్ మాట్లాడుతూ.. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారీ సభ ఉంటుందని ఈ సభకు జిల్లాలోని మేదావులు, ప్రజా సంఘాలు, అయా సంఘాల నేతలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి మల్లన్న, కామారెడ్డి జేఏసీ కన్వీనర్ జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

ఏంఎసీ సర్వసభ్య సమావేశం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశం చైర్మన్ కాశీ నారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో లింగంపేటలో కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు జీపీ స్థలం కేటాయించాలని కోరుతూ తీర్మానం చేయగా, నాగిరెడ్డిపేట, ఎల్లారం మార్కెట్ కమిటీ గోదాముల వద్ద వేబ్రిడ్జిల నిర్మాణం కోసం తీర్మానాలు చేసినట్లు కార్యదర్శి దూమ్‌డా నాయక్ తెలిపారు. వైస్ చైర్మన్ సిద్దిరాంరెడ్డి, డైరెక్టర్లు, మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ నర్సింలు, తదితరులున్నారు.

గణపయ్య మా మొర ఆలకించవయ్యా!



పూజలో పాల్గొన్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

భిక్కనూరు: ఓ గణపయ్య ఎన్నో ఏళ్లుగా విద్యార్థులకు ఉన్నత విద్యను బోధిస్తూ బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నప్పటికి మా ఉద్యోగాలు భద్రంగా లేవు మా మొర ఆలకించి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయించు స్వామి అంటూ తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ కాంట్రాక్టు అధ్యాపకులు బుధవారం క్యాంపస్‌లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి పూజలు చేసి వేడుకున్నారు. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు తమ ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేసేలా తమను ఆశీర్వదించమని వారు గణపతిని మొక్కుకున్నారు. కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా, ప్రతినిధులు సునీత, నిరంజన్ శర్మ, రమాదేవి, వైశాలి, సరిత తదితరులు పాల్గొన్నారు.

జీపీ రికార్డుల పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): దావల్‌మల్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను ఎంపీవో ప్రకాష్ బుధవారం పరిశీలించారు. అనంతరం నర్సరీ, ప్రకృతి వనాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి సుజాత తదితరులున్నారు.

డాక్టరేట్ పొందిన అధ్యాపకుడికి అభినందన



రాజేశ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ గంగాధర్

బాన్సువాడ రూరల్: శ్రీరామ్ నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో వృక్షశాస్త్రం బోధించే అధ్యాపకుడు దేవరాయి రాజేష్ డాక్టరేట్ పట్టా పొందటంతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందూరి గంగాధర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. సహచర అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. కళాశాలలో వివిధ సబ్జెక్టులు బోధించే అధ్యాపకులు బోధనలో చక్కటి అనుభవం గడించిన వారున్నారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అరుణ, వివర్ధిని, జలంధర్, ఆరతి, శ్రీనివాస్, వెంకట్రావ్, రాథోడ్ కృష్ణ, పురుషోత్తమ్, యూనిస్, బాలరాజ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కు, జైన, పార్సీ, బౌద్ధ మతాలకు చెందిన వారు విదేశాల్లో ఉన్నత చదువుల కోసం సీఎం ఓవర్సీస్ స్కాలర్ షిప్ కోసం ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ జిల్లా అధికారి టి.దయానంద్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు వివరాలు పొందుపర్చి వ్యక్తిగతంగా కలెక్టరేట్‌లోని 222 నంబర్ గది మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు 8096973346 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పారిశుధ్యం లోపించకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాలని ఎంపీడీవో మల్లికార్జున్ రెడ్డి సూచించారు. బుధవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షించి మాట్లాడారు. గ్రామాల్లో మురికి కాల్వల పూడికతీత చేపట్టాలన్నారు. దోమలు ప్రబలకుండా మందులు పిచికారీ చేయాలని ఆదేశించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున పోలింగ్ కేంద్రాలు గుర్తించి సిద్ధం చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం పకడ్బందిగా అమలు చేయాలన్నారు. ఎంపీవో ప్రభాకరచారి, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీవో శ్రీనివాస్

వందశాతం పన్నులు వసూలు చేయాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఈ నెలాఖరులోపు గ్రామాలలో వంద శాతం పన్నులను వసూలు చేయాలని ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం 9 నుంచి 11 గంటలలోపు డీఎస్ఆర్ నమోదు ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ట్రాక్టర్ లోన్ డబ్బులను, కరెంట్ బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు.

అవినీతి డీఎంహెచ్‌వోను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ నేతలు

కామారెడ్డి టౌన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిపై పూర్తి విచారణ జరిపి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ యువజన నియోజకవర్గ అధ్యక్షుడు ఐరేని సందీప్ డిమాండ్ చేశారు. అధికారి అవినీతిపై అన్ని ఆధారాలు, సాక్ష్యాలతో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు అందజేశామని తెలిపారు. డీఎంహెచ్‌వో పాటు మరో నలుగురు ఉద్యోగుల ఫోన్‌పే, గూగుల్‌పే అకౌంట్లను తనిఖీ చేస్తే అవినీతి అంతా బయటపడుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. నాయకులు ప్రవీణ్, రాజశేఖర్, ఇర్ఫాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ సభ్యులు

భిక్కనూరు: అంతంపల్లిలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు సుస్థిర వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజు మాట్లాడుతూ.. తమ సంస్థ రైతుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. వ్యవసాయంలో నూతన పద్ధతులు, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. వీడీఎఫ్ ద్వారా రైతులకు మరింత సేవలు అందజేస్తామన్నారు. రిలయన్స్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్వేత, ఎక్స్‌టెన్షన్ వర్కర్ భూపతి, సర్పంచ్ మధు మోహన్ రెడ్డి, తదితరులున్నారు.

మధ్యాహ్న భోజన బకాయిలు చెల్లించాలి



బాన్సువాడలో సమ్మె చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు



ఎల్లారెడ్డిలో ధర్నా చేస్తున్న నిర్వాహకులు

బాన్సువాడ : మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు డిమాండ్ చేశారు. బుధవారం బాన్సువాడ ఆర్డీవో కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన నిర్వాహకులు, కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించే వరకు కార్మికులు సమ్మెలో ఉంటారని స్పష్టం చేశారు. బాల్‌రాజ్, నీలాబాయి. హన్మండ్లు, నరసింహులు, తదితరులున్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలో ఎండీఎం నిర్వాహకులు బుధవారం ధర్నా నిర్వహించారు. పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో వారు నిరసన తెలిపారు. ఎండీఎం నిర్వాహకులకు పెంచిన వేతనాలను ఏప్రిల్ నుంచి అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగునంగా చార్జీలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సాయిలు, దుర్గవ్వ ఉన్నారు.

ఇంటి భోజనమే దిక్కయింది..!



గోపాల్‌పేట మోడల్‌స్కూల్‌లో ఇంటి భోజనం చేస్తున్న విద్యార్థులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సమస్యల పరిష్కారం కోసం మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు బుధవారం నుంచి సమ్మెబాట పట్టడంతో మండలంలోని చాలా పాఠశాలల్లో విద్యార్థులు ఇంటి నుంచే భోజనం తెచ్చుకున్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 20 నుంచి తాము సమ్మెలోకి వెళ్తామని నిర్వాహకులు ఇదవరకే విద్యాశాఖ అధికారులకు సమ్మె నోటీసును అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో యూనియన్ నాయకుల సూచనలమేరకు ముందుగా నిర్ణయించిన దాని ప్రకారం బుధవారం నుండి సమ్మె బాట పట్టారు. దీంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుకాలేదు. ఇంటి నుంచే భోజనం తెచ్చుకోవాలని ఉపాధ్యాయులు సూచించడంతో విద్యార్థులు టిఫిన్ బాక్సులను తెచ్చుకున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

రాజంపేట: వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని డీఎస్పీ ప్రకాశ్ అన్నారు. బుధవారం ఆరేపల్లిలో రాజంపేట పోలీస్ పరిధి ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. రోడ్డు భద్రత, సీసీ కెమెరాల ప్రాధాన్యత, మహిళల భద్రత, సైబర్ నేరాలు, బాల కార్మికులు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ తిరుపయ్య, ఎస్సై సంపత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు పీజీ హెచ్‌ఎంల సంఘీభావం



కామారెడ్డి టౌన్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారానికి 24వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు గెజిటెడ్ పీజీ హెచ్‌ఎంల సంఘం ప్రతినిధులు తమ సంఘీభావం తెలిపారు. జిల్లా పీజీ హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు నీలం లింగం మాట్లాడుతూ.. ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. సర్వ శిక్ష అభియాన్ అసోసియేషన్ జేఏసీ అధ్యక్షుడెఉ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సంపత్, నాయకులు భాను ప్రసాద్, రాములు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

సింహ గర్జనను విజయవంతం చేయాలి

మద్నూర్(జుక్కల్): బిచ్కుంద మండల కేంద్రంలో గురువారం నిర్వహించే మున్నురుకాపు సింహ గర్జన సభను విజయవంతం చేయాలని ఆయా పార్టీల నాయకులు, మున్నూరుకాపు సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలో బుధవారం బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన మున్నూరుకాపులు సమావేశం ఏర్పాటు చేశారు. డిమాండ్ల సాధన కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని వారు పేర్కొన్నారు. సర్పంచ్ సురేష్, ఆత్మ కమిటీ చైర్మన్ గంగాధర్, తదితరులున్నారు.

పలకలు, నోట్ బుక్కుల పంపిణీ

పిట్లం(జుక్కల్): బొగ్గులకుంట తండా, కోమటిచెరువు తండాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు, అంగన్వాడీ కేంద్రాలలోని పిల్లలకు బుధవారం పలకలు, నోట్‌బుక్స్, పెన్నులను వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాట్రోత్ రవీందర్ పంపిణీ చేశారు. సర్పంచ్ దేవ్‌రావు, ప్రధానోపాధ్యాయులు గంగారం, పాఠశాల చైర్మన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు లడ్డూ ప్రసాదం

కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తయారు చేసిన లడ్డూ ప్రసాదాలను బుధవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ చేతుల మీదుగా వినాయక మండపాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంప ప్రసాద్, గుడుగుల శ్రీనివాస్, గణేష్ నాయక్, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

బలరామ జయంతి వేడుకలు

లింగంపేట(ఎల్లారెడ్డి): పర్మళ్లలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం బలరామ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతు దినోత్సవం జరిపి జెండాను ఆవిష్కరించారు. సీజీఆర్ఎఫ్ మెంబర్ రాజాగౌడ్, ప్రభురాజం, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ

భిక్కనూరు: మండల కేంద్రంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో రూ.32 లక్షలతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు సింగిల్ విండో చైర్మన్ గంగ్గల భూమయ్య, సర్పంచ్ తుక్కి వేణులు బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ పురాం రాజమౌళి, డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ, ఉప సర్పంచ్ బోడ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

గంజ్ వర్తక సంఘం వార్షికోత్సవాల్లో ప్రవచనాలు

కామారెడ్డి అర్బన్: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కామారెడ్డి సిరిసిల్ల రోడ్డులోని గంజ్ ధర్మశాల 74వ వార్షికోత్సవాల్లో శ్రీరామకోటి జపలిఖిత ప్రచారకులు కృష్ణానంద స్వామి ప్రతిరోజు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 8 గంటలకు ప్రవచనాలు చేస్తున్నారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో గంజ్ వర్తక సంఘం ప్రతినిధులు పార్శి రాజు, యాదనాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గాయత్రి షుగర్స్ గణేశ్ వద్ద అన్నదానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద గురువారం భారీ ఎత్తున అన్నదానం నిర్వహించనున్నట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు.